క్లుప్తంగా

భక్తిమార్గంలో నడవాలి



భగవద్గీతపై ప్రచారం చేస్తున్న దృశ్యం

నందికొట్కూరు: ప్రతి ఒక్కరూ భక్తిమార్గంలో నడవాలని త్రైతసింద్ధాత ప్రభోద సేవసమితి హిందూ జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు రామ చంద్రుడు అన్నారు. అచార్య ప్రభోదానంద యోగేశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథములను చదవాలంటూ పాముల పాడు మండల పరిధిలోని బానుముక్కల, బానకచెర్ల గ్రామాలలో ఆదివానం ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మార్గశిర మాసంలో ఎంతో భక్తిశ్రద్ధలతో మెలగాలన్నారు. దైవభక్తితో గ్రంథపఠనంతో జ్ఞానంతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో సభ్యులు మునిదాసు, కుమారాచారి, సంజీవ, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గూడేల్లో ఉచిత వైద్యశిబిరాలు



పాలెంచెరువు గూడెంలో చిన్నారులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్లు

కొత్తపల్లి: మండలంలోని శివపురం, ఎర్రకుంట, పాలెంచెరువు, చదరంపెంట గూడెలలో ఆదివారం సంఘమిత్ర సేవాసమితి, ఐఎంఏ ఉమెన్స్ డాక్టర్స్ వింగ్ నంద్యాల వారి సహకారంతో గిరిజనులకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. డాక్టర్లు సత్యశివ సుందరి, సరిత, మధుప్రీతి, శిరీష, ఉదయ శంకర్‌లు సుమారు 94 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గిరిజనులకు పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రతలపై, ఆరోగ్య సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో సేవాభారతి ప్రాంత సహ సేవా ప్రముఖ్ మనోహర్, భక్తకన్నప్ప గురుకులం ఆవాస కార్యదర్శి ఎం.రఘు రాములు, వాసుదేవరెడ్డి, శ్రీనివాసులు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి



పథకాలపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ చంద్రమోహన్ యాదవ్

మిడుతూరు: అర్హులైన ప్రతి ఒక్కరూ కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చౌట్కూరు పశువైద్యాధికారి చంద్రమోహన్ యాదవ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని చౌట్కూరు గ్రామంలో సర్పంచ్ మదార్ సాహెబ్ అధ్యక్షతన, 49-బన్నూరు గ్రామంలో సర్పంచ్ భూదేవి అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగాహన కలిగి ఉండటంతో పాటు పథకాల లబ్ధితో అభివృద్ధి పథంలోకి రావాలని ఆకాంక్షించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన ఆయుష్మాన్ భారత్, ముద్ర యోజన, ప్రధాన మంత్రి జల జీవన్ మిషన్, పీఎం కిసాన్ కార్డులు తదితర పథకాల గురించి వివరించారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

కొత్తపల్లి: అర్హత ఉన్న రైతులందరూ రాష్ట్ర ప్రభుత్వం అందించే రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.మహేష్ ఆదివారం సూచించారు. కొత్తగా పొలం ఆన్‌లైన్ చేసుకున్నవారు, వివిధ లోపాలవల్ల అర్హత సాధించక వాటిని సరిదిద్దుకున్నారు దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. అదేవిధంగా చనిపోయిన రైతులకు రైతుభరోసా వస్తుంటే వారిని తీసేవేసి నామినీని రిజిస్టర్ చేసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందని పేర్కొన్నారు. అలాంటి వారు ఉంటే రైతుభరోసా కేంద్రాలను సంప్రదించాలని తెలిపారు.

యువతి అదృశ్యం



గూడరాణి

నందికొట్కూరు: పాముల పాడు మండల పరిధిలోని మద్దూరు గ్రామంలో జ్ఞానమ్మ, శిఖామణిల మనవరాలు గూడరాణి అదృశ్యమైనట్లు ఎస్ఐ అశోక్ ఆదివారం తెలిపారు. ఈ నెల 16న ఇంటి నుంచి బయటికి వెళ్లిన మనవరాలు తిరిగిరాకపోవడంతో అవ్వ జ్ఞానమ్మ తెలిసిన వారి వద్ద విచారించింది. అయినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడి ఎన్నిక

నంద్యాల(అర్బన్): మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడిగా కత్తి ఓబులేసు మాదిగ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక కార్యాలయంలో ఎంఎస్‌పీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి విభాగాల నాయకుల సమావేశం నిర్వహించారు. నంద్యాల జిల్లా ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల ఇంచార్జ్ సుభాష్ చంద్ర, ఎంఈఎఫ్ జాతీయ నాయకులు నరసింహులు ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

అవ్వాతాతలకు కొత్త సంవత్సరం 'కానుక'

- సామాజిక పింఛన్ రూ.3 వేలకు పెంపు
- జనవరి 1 నుంచి పంపిణీ
- మంత్రివర్గ సమావేశంలో ఆమోదం
- సంబరపడుతున్న అవ్వాతాతలు, వితంతువులు

ఆత్మకూరు: నూతన సంవత్సరం పండగతో పాటు అవ్వాతాతలకు పింఛన్ల పండుగ రానేవచ్చింది. పాదయాత్ర సమయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్లను పెంచుతూ పోతామంటూ ప్రజలకు హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడి అధికారంలోకి వచ్చాక రూ.2,250 లతో పింఛన్ ప్రారంభించారు. ప్రతినెలా 1వ తేదీన ఠంఛన్‌గా ఇంటి వద్దకే పింఛన్ అందజేస్తూ ఆదుకుంటున్నారు. ఈ క్రమంలో ప్రతి ఏటా పింఛన్ సొమ్ము పెంచుతూ 2024 జనవరి 1వ తేదీ నుంచి రూ.3 వేలు అందించనున్నారు. ఈ మేరకు ఈనెల15న కేబినెట్ ఆమోదం తెలపడంతో అవ్వాతాతలు, వితంతువులు సంబరపడుతున్నారు.

టీడీపీ హయాంలో కేవలం రూ.వెయ్యి..

టీడీపీ ప్రభుత్వంలో కేవలం రూ.1000 పింఛన్ అందజేసేవారు. గత ఎన్నికల సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇవ్వడంతో టీడీపీ నేతలు మేలుకుని ఉన్నఫలంగా రూ.2000లకు పింఛన్‌ను



గరీబ్‌నగర్‌లో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ (ఫైల్)

పెంచారు. వైఎస్సార్‌సీపీ ఎన్నికల్లో గెలిచాక.. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఏటా రూ.250 పెంచుకుంటూ వచ్చారు. తాజాగా వచ్చే నెల నుంచి రూ.3000 ఇచ్చేందుకు కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నారు.

పండుగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ

పెంచిన పింఛన్లు పంపిణీ చేసేందుకు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇప్పటికే సర్వం సిద్ధం

నియోజకవర్గంలో పింఛన్ లబ్ధిదారుల వివరాలు..

మండలం	మొత్తం పింఛన్‌దారులు
ఆత్మకూరు(పట్టణం)	4,164
ఆత్మకూరు మండలం	4,727
శ్రీశైలం	2,160
బండిఆత్మకూరు	6,326
వెలుగోడు	6,397
మహానంది	4,999
మొత్తం	28,773

చేశారు. వచ్చే నెల 1వ తేది నుంచి రూ.3వేలు పంపిణీ చేయనున్నారు. శ్రీశైలం నియోజకవర్గంలోని శ్రీశైలం, ఆత్మకూరు, ఆత్మకూరు టౌన్‌లతో పాటు వెలుగోడు, బండిఆత్మకూరు, మహానంది మండలాల్లో 1వ తేదీ నుంచి పింఛన్ల పంపిణీ జరగనుంది. మండలంలో మొత్తం 28,773 మందికి లబ్ధి చేకూరనుంది. పలు చోట్ల ఎమ్మెల్యేతోపాటు ఎంపీడీఓలు, వార్డు కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీల ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం పండుగ వాతావరణంలో నిర్వహించనున్నారు. పాదయాత్ర సమయంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు 99 శాతం హామీలు నెరవేర్చారని లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

చాలాసంతోషంగా ఉంది



పింఛన్లు పెంచి ఇవ్వడం సంతోషంగా ఉంది. ఇచ్చిన మాట ప్రకారం కట్టుబడి ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇంటి వద్దకే నెల నెలా పింఛన్ డబ్బు అందజేస్తున్నారు. ప్రతి ఏటా రూ.250 పెంచుతూ వస్తున్నారు. పింఛన్ నగదును మందులకు, ఇతర అవసరాలకు వినియోగిస్తున్నాం. –హమిదాబీ, ఆత్మకూరు

రూ.200 నుంచి పింఛన్ తీసుకుంటున్నా



రూ.200లు ఉన్నప్పటి నుంచి పింఛన్ తీసుకుంటున్నాను. ముఖ్యమంత్రిగా జగన్ వచ్చాక రూ.2 వేలకు పైనే తీసుకుంటున్నా. వచ్చే నెల నుంచి రూ.3వేలు ఇస్తామంటున్నారు. ముఖ్యమంత్రి జగన్ చల్లగా ఉండాలి. కుటుంబపెద్ద కొడుకుగ మమ్మల్ని ఆదుకుంటున్నాడు. పింఛన్ పెంచడం ఆనందంగా ఉంది. – అమిరున్‌బీ, ఆత్మకూరు

నేడు ఆరోగ్యశ్రీ బ్రోచర్ విడుదల

నందికొట్కూరు: సోమవారం ఉదయం 11 గంటలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ బ్రోచర్‌లను వర్చువల్‌గా విడుదల చేస్తారని పాములపాడు ఎంపీడీఓ గోపీకృష్ణ, పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ నాగలక్ష్మి ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

కొత్తపల్లి: పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందించాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య శ్రీని అమలు చేస్తుందని ఎంపీడీఓ మేరి ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్‌గా ఆరోగ్య శ్రీ బ్రోచర్‌ను విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు టీవీలు, వీడియో కాన్ఫరెన్స్‌లలో వీక్షించాలని కోరారు.

దూదేకుల సంఘం జిల్లా అధ్యక్షుడి ఎన్నిక

నంద్యాల(సిటీ): నంద్యాల జిల్లా దూదేకుల సంఘం నూతన అధ్యక్షుడిగా వాసవి దస్తగిరి, ప్రధాన కార్యదర్శి గోల్డ్ దస్తగిరి, కోశాధికారిగా ఉశేనప్పను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక నూర్ నర్సింగ్ హోం ఆవరణలో ఆదివారం జిల్లా దూదేకుల సంఘం నాయకుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. అలాగే జిల్లా గౌరవ అధ్యక్షుడిగా డాక్టర్ మహమ్మద్ హుసేన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చిన్నబాబు, క్రాంతి, కార్యదర్శులుగా అబ్దుల్లా, జాకీర్, నాగరాజు, ఖాసీం, మరో 15 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. డాక్టర్ బాబన్, పర్ల దస్తగిరి పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణపై డీలర్లకు అవగాహన

పగిద్యాల: పంటలను ఆశించే చీడపీడలు, తెగుళ్లు, పోషకలోపాల గుర్తింపు, పరిశీలన, నిర్ధారించడంపై ఇనుపుట్ డీలర్లకు నంద్యాల డాట్ సెంటర్ క్రాప్ ప్రొటెక్షన్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ రామకృష్ణారావు అవగాహన కల్పించారు. భారతదేశ మంత్రిత్వ ఎరువుల శాఖ, రాష్ట్ర వ్యవసాయ విస్తరణ యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో దేశి డిప్లొమా శిక్షణ కోర్సు పొందుతున్నా 2023-24 బ్యాచ్ 40 మంది ట్రైనీలతో క్షేత్ర సందర్శన కార్యక్రమం చేపట్టారు. ఆదివారం మండలంలోని పాత, కొత్త ముచ్చుమర్రి గ్రామాల్లో బైరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి సాగు చేసిన శ్రీ గంధం, సీతాఫలం తోటలు, అలాగే బైరెడ్డి సిద్ధార్థరెడ్డి పొలంలో సాగు చేస్తున్న మునగ, మారేడు పంటలను పరిశీలించారు. అలాగే నెహ్రూనగర్‌లో ప్రమీలారెడ్డి సాగు చేసిన చీనీ, నిమ్మ తోటలు,



చీడపీడల నివారణపై అవగాహన కల్పిస్తున్న సైంటిస్ట్ డాక్టర్ రామకృష్ణారావు

మినుము పంట, పండు మిరప తోటలు, బిజినీవేములలో సుధాకర్ సాగు చేసిన శగన పంటలను సందర్శించారు. కార్యక్రమంలో నందికొట్కూరు దేశీ సెంటర్ ఫెసిలిటేటర్ గౌరీశ్వర నాయుడు, ట్రైనీలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనకు మార్గం దీక్షలు

నంద్యాల(వ్యవసాయం): ఆధ్యాత్మిక చింతనకు, మానసిక ప్రశాంతతకు, ఏకాగ్రత, క్రమశిక్షణకు దీక్షలు ఉపయోగపడతాయని రామకృష్ణా విద్యాసంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి, అభిరుచి మధు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక భద్రావతీ భావనారుషి దేవాలయంలో భవానీ మాలధారులతో పూజా కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పట్టణ ప్రజలు హిందూ ధర్మ పరిరక్షణలో భాగంగా గత నాలుగు సంవత్సరాల నుంచి అరుంధతీ నగర్, బైటిపేట, హరిజనపేట, జగజ్జననీ నగర్ తదితర ప్రాంతాల్లోని దళిత, బడుగు, బలహీన వర్గాల వారిని భవానీ దీక్షలను స్వీకరింపజేసి, ఆధ్యాత్మిక మార్గం వైపు నడిపించిన గురు భవానీలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వారిని సత్కరించారు.

ప్రేమను చాటిచెప్పిన మహనీయుడు ఏసుక్రీస్తు

మిడుతూరు: ప్రపంచానికి ప్రేమ, త్యాగం, కరుణను చాటిచెప్పిన మహనీయుడు ఏసుప్రభువు అని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఉప్పలదడియ గ్రామంలోని ఆర్‌సీఎం చర్చిలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. వేడుకలకు ముఖ్యఅతిథిగా నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్‌కు విచారణ గురువు మధుబాబు ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రిస్మస్ పర్వదిన విశిష్టత, ఏసుప్రభువు సందేశాన్ని వినిపించారు. కార్యక్రమంలో నాయకులు సల్కోటీ గోవర్ధన్‌రెడ్డి, వంగూరు జనార్ధన్‌రెడ్డి, కమతం వీరారెడ్డి, కమతం రాజశేఖరరెడ్డి, కమతం మహేశ్వరరెడ్డి, ఉండవల్లి ధర్మారెడ్డి పాల్గొన్నారు.



ముందస్తు క్రిస్మస్ ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

మహానందిలో సండే సందడి



మహానంది కోనేరులో భక్తుల పుణ్యస్నానాలు

మహానంది: సెలవు రోజు కావడంతో ఆదివారం మహానంది ఆలయం భక్తులతో కళకళలాడింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఉదయం అష్టావిధ మహా మంగళ హారతుల సమయం నుంచి ప్రారంభమైన శ్రీ కామేశ్వరి దేవి, మహానందీశ్వర స్వామి వారి దర్శనం రాత్రి ఏకాంత సేవ వరకు నిర్విరామంగా కొనసాగింది. భక్తులు స్థానిక కోనేర్లలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి అమ్మవారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు.

భక్తులతో కళకళలాడిన ఓంకారం

బండిఆత్మకూరు మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన ఓంకారం ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు పంచబుగ్గల కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం శ్రీ గంగా ఉమా సమేత ఓంకార సిద్ధేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. పూజల అనంతరం శ్రీ కాశిరెడ్డి నాయన అన్నప్రసాద వితరణ కేంద్రం వద్ద భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు.

మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

నంద్యాల(న్యూటౌన్): టైణంలోని పిరమిడ్ పాఠశాలలో ఆదివారం నంద్యాల జిల్లా స్క్వే మార్షల్ ఆర్ట్స్ బెల్ట్ పోటీలు పబెల్ట్ పరీక్ష, టెక్నికల్ సెమినార్ నిర్వహించారు. పోటీలకు ముఖ్య అతిథిగా ఏపీ స్క్వే చైర్మన్ ఇస్మాయిల్, ప్రధాన కార్యదర్శి ఇబ్రహీం, అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, ఏపీ ఉపాధ్యక్షుడు నబీ సాహెబ్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వల్ల బుద్ధి బలం, క్రమశిక్షణ, శారీరక ధృడత్వం, మానసిక ఉల్లాసం అలవడుతుందన్నారు. ప్రతిభ చాటిన స్క్వే విద్యార్థులకు బెల్టులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

ప్రాజెక్ట్ కాలనీలో 'వై ఏపీ నీడ్స్ జగన్'



వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

శ్రీశైలంప్రాజెక్ట్: ఆంధ్రరాష్ట్రానికి మళ్లీ జగనన్నే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమాన్ని ఆదివారం శ్రీశైలంప్రాజెక్ట్ కాలనీలో నిర్వహించారు. పాతమార్కెట్ సమీపంలోని ఫైర్ స్టేషన్‌వద్ద వైఎస్సార్‌సీపీ జెండాను శ్రీశైలం మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎగురవేశారు. గ్రామసచివాలయం-1 పరిధిలో ఇంటింటికీ వెళ్లి జగనన్న రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయిన తర్వాత నవరత్నాల పథకాల అమలు, ఇతర సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వట్టి వెంకటరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు జింకా గుండయ్య యాదవ్, మండల నాయకులు భరత్‌రెడ్డి, ఆసాది ప్రవీణ్ దివ్యతేజ, బూదాల దానియేలు, మురికిపూడి పాపారావు, గౌస్‌మొహిద్దీన్, ఏసు తదితరులు పాల్గొన్నారు.

ఏకంగా మట్టలే దొరికాయ్..



బురద మట్టలను చూపుతున్న యువకులు

దొర్నిపాడు: మండలంలోని క్రిష్టిపాడు వద్ద కూందునదిలో ప్రస్తుతం నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో యువకులు ఆదివారం గాలాలతో చేపలను పట్టే పనిలో నిమగ్నమయ్యారు. చాలా అరుదుగా దొరికే బురదమట్టలు దొరకగడంతో యువకులు సంతోషం వ్యక్తం చేశారు. సుమారు ఒక్కో చేప 5కిలోల వరకు ఉన్నాయని, కిలో రూ.250 వరకు విక్రయించుకోవచ్చని చెప్పారు. ఇక చేపల ప్రియులకు ఈ చేపలంటే మక్కువ కూడా.

ప్రవక్త జీవితం అనుసరణీయం

నంద్యాల(వ్యవసాయం): మహమ్మద్ ప్రవక్త జీవితం అనుసరణీయమని ముస్లిం రచయితల సంఘం (మురసం) రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్ సమద్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక రాయల్ పబ్లిక్ స్కూల్‌లో పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రముఖ ముస్లిం రచయిత మహబూబ్ సాహెబ్ రచించిన ప్రవక్త మహమ్మద్, ప్రవక్త ఇబ్రహీం పుస్తకాలను ఆవిష్కరించారు. మురసం జిల్లా గౌరవ అధ్యక్షుడు ముర్తుజా, ఇసాక్ వలి, కవులు కొప్పుల ప్రసాద్, మహబూబ్ బాషా, ఓబులేసు, మహమ్మద్ రఫీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణ గావిస్తున్న దృశ్యం

సేవలు విస్తృతం చేయాలి

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల జిల్లాలో వాసవీ క్లబ్ సేవలు విస్తృతం చేయాలని ఇంటర్నేషనల్ వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ జయంతి వెంకటేశ్వర్లు సూచించారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఇంటర్నేషనల్ క్లబ్ డైరెక్టర్ నాగసుప్రజ ఆధ్వర్యంలో జిల్లా కేబినెట్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ త్వరలో నూతన కేబినెట్‌ను ఎన్నుకుంటారన్నారు. మండల స్థాయి నుంచి క్లబ్ సేవలను అందిస్తామని తెలిపారు.

చెంచులకు రెడ్‌క్రాస్ చేయూత

వెలుగోడు: పట్టణంలో జగనన్న కాలనీ వద్ద గుడిసెలు వేసుకున్న చెంచులకు రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు ఆదివారం టార్పాలిన్లు పట్టలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ అధికారి మిరియాల దాస్, సబ్ ఇన్‌స్పెక్టర్ వెంకట్ ప్రసాద్, లిటిల్ ఏంజిల్స్ హైస్కూల్ కరస్పాండెంట్ ఇమ్మానుయేలు మాట్లాడుతూ.. చెంచులకు తమవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తామని చెప్పారు. ఇళ్ల నిర్మాణం, మౌలిక వసతులు, రోడ్లు, తాగునీటి వసతి కల్పిస్తామన్నారు. 51 మంది చెంచులకు టార్పాలిన్లు పంపిణీ చేసి, భోజన వసతి కల్పించారు. రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రజలకు మెడికల్ క్యాంపులు, రక్తదాన శిబిరాలు, దుప్పట్లు, చీరల పంపిణీ ఇలా ఎన్నో సేవా



టార్పాలిన్లు అందజేస్తున్న దశ్యం

కార్యక్రమాలు చేస్తున్నామని నంద్యాల జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షుడు దస్తగిరి తెలిపారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు మునిరుద్దీన్, నాగేశషులు, చాంద్ బాషా, తిరుపాలు, శాలు బాషా తదితరులు పాల్గొన్నారు.

తిరుప్పావై అద్భుత వేదాంత గ్రంథం



డాక్టర్ దివి హయగ్రీవాచార్యులు

నంద్యాల(వ్యవసాయం): ధనుర్మాసంలో నిర్వహించే తిరుప్పావై పాశురాలు అద్భుత వేదాంత గ్రంథమని తిరుమల తిరుపతి దేవస్థానం బ్రహ్మోత్సవ వ్యాఖ్యాత డాక్టర్ దివి హయగ్రీవాచార్యులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సంజీవనగర్ రామాలయంలో సాయంత్రం తిరుమల తిరుపతి దేవస్థానం దివ్యప్రభంద ప్రాజెక్ట్, నంది రైతు సమాఖ్య శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో తిరుప్పావై ప్రవచనాలను భక్తులకు వినిపించారు. ఆయన మాట్లాడుతూ గోదాదేవి భగవంతుడినే తన భర్తగా భావించి ధనుర్మాస వ్రతాన్ని నిర్వహించిందని తెలిపారు. అనంతరం మొదటి రోజు మొదటి పాశురాన్ని భక్తులకు వినిపించారు. మంచి అలవాట్లతో జీవించమని తోటి వారికి సహాయపడమని భగవంతుడిని తప్పనిసరిగా ఆరాధించమని ఈ పాశురాలు తెలియజేస్తున్నాయని వివరించారు. కార్యక్రమంలో సూరయ్య, శ్రీనివాస్, మధు, డాక్టర్ రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

వెంకటేశ్వర్లు భళా

- ఎకరాకు 54 బస్తాల దిగుబడి
- రైతును అభినందిస్తున్న గ్రామస్తులు

వెలుగోడు: ఎకరం పొలంలో వరి సాగుచేస్తే సాధారణంగా 25 నుంచి 30 బస్తాల ధాన్యం దిగుబడి వస్తుంది. గతేడాది రైతులు సోనా మసూరి వరి ఎకరానికి 45 బస్తాల వరకూ దిగుబడి సాధించారు. ఇప్పుడు ఆ రికార్డులను అధిగమిస్తూ వెలుగోడు మండలం బోయరేవుల గ్రామానికి చెందిన బోయ వెంకటేశ్వర్లు 54 బస్తాల ధాన్యాన్ని పండించాడు. నంద్యాల సోనా మసూరి వరి రకాన్ని సాగుచేసి, కలుపుతీత, పొట్ట దశ, వరి కోత దశల్లో వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించి ఈ



వరి దిగుబడిని చూపిస్తున్న రైతు వెంకటేశ్వర్లు

ఘనత సాధించానని వెంకటేశ్వర్లు చెప్పారు. వరి సాగులో అనుభవం లేకున్నా ఆయిల్ ఇంజన్‌తో నీళ్లు కొట్టి ఎకరా పొలంలో 54 బస్తాల దిగుబడిని సాధించిన రైతు వెంకటేశ్వర్లును స్థానికులు అభినందిస్తున్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల దీక్షలు



ఆత్మకూరులో దీక్షలో కూర్చున్న అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు

ఆత్మకూరు: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆదివారం అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల యూనియన్ నాయకులు నిరసన కార్యక్రమం కొనసాగించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల యూనియన్ నాయకురాళ్లు, మంజుల, లక్ష్మీదేవి, ప్రమీలమ్మ మాట్లాడుతూ తాము ఆరు రోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్నామని, ప్రభుత్వం స్పందించి తమకు వేతనం పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కవిత, వాణి, విజయలక్ష్మి, లక్ష్మీదేవి, సుజాత, సుధారాణి, వెంకటలక్ష్మి, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల రిలేనిరాహార దీక్ష

శ్రీశైలంప్రాజెక్ట్: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చేస్తున్న రిలేనిరాహార దీక్ష ఆదివారం ఆరో రోజుకు చేరుకుంది. శ్రీశైలం ప్రాజెక్ట్ కాలనీలో అంబేడ్కర్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో అంగన్‌వాడీ ఆయాలు, కార్యకర్తలు దీక్ష కొనసాగించారు. ఏఐటీయూసీ, తెలంగాణ జెన్‌కో అసోసియేషన్ నాయకులు లక్ష్మయ్య అంగన్‌వాడీలకు మద్దతు తెలిపారు.

వెలుగోడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం కూడా కొనసాగింది. 6వ రోజు ఆందోళనకు వెలుగోడు లోని అన్ని అంగన్‌వాడీల సెంటర్ల నుంచి పిల్లలు, పిల్లల తల్లిదండ్రులు మద్దతు తెలిపారు. కేవీపీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి కే రామదాసు, వెలుగోడు సీఐటీ మండల అధ్యక్షుడు వి.నాగమోహన్, వెలుగోడు అంగన్‌వాడీ టీచర్స్ సెక్టార్ నాయకురాళ్లు భాగ్యలక్ష్మి, అనిత, రవణమ్మ పాల్గొన్నారు.

24న ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

మిడుతూరు: క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకొని ఈనెల 24న మండల కేంద్రమైన మిడుతూరులోని ఏబీఎం చర్చి సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో విజేతలైన జట్లకు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి మొదటి బహుమతి రూ.15,016, రెండో బహుమతి 10,016, సంజీవకుమార్ (పీఈటీ) జ్ఞాపకార్థం మూడో బహుమతి రూ.7,016, విజయ్ కుమార్ జ్ఞాపకార్థం నాల్గవ బహుమతి యరభం ప్రభాకర్ రెడ్డి రూ 5016 అందజేస్తారన్నారు. ఆసక్తి కల వారు రూ.300 ఎంట్రీ ఫీజు చెల్లించి జట్టు పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు .. 9182039252, 8790400794, 6303354390 సంప్రదించవచ్చన్నారు.